శరవేగంగా క్లీన్ డంపింగ్ యార్డు

- పేరుకుపోయిన వ్యర్థాలు 37 వేల మెట్రిక్ టన్నులు
- ఇప్పటికే 26 వేల టన్నులు రీ సైక్లింగ్
- లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా పనులు
- తీరుతున్న దుర్వాసన సమస్య

నిడదవోలు: ఎన్నో ఏళ్లుగా మునిసిపాలిటీకి సమస్యగా మారిన డంపింగ్ యార్డు ప్రక్షాళన పనులు పట్టణ శివార్లలో శరవేగంగా సాగుతున్నాయి. డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయే పొడి చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి, డంపింగ్ యార్డు స్థలాలను పార్కులు, ఇతర అవసరాలకు వినియోగించుకునే కార్యక్రమానికి 2023 జూలైలో శ్రీకారం చుట్టారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీల పరిధిలో ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. ఇందులో భాగంగా నిడదవోలు పట్టణంలో సేకరించిన 37 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా సైక్లింగ్ చేస్తున్నారు. ఇప్పటికే 26 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను పునర్ వాడకానికి అనువుగా శుద్ధి చేశారు. ఈ విధంగా వచ్చిన ప్లాస్టిక్‌ను గుంటూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పవర్ ప్రాజెక్టుకు తరలిస్తున్నారు.



డంపింగ్ యార్డులో వ్యర్థాలను వేరు చేస్తున్న లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్

వ్యర్థాల వేరు చేసి తరలింపు

ఏళ్ల తరబడి డంపింగ్ యార్డుల్లో కొండల్లా పేరుకుపోయిన వ్యర్థాలను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ప్లాస్టిక్, ఇనుము, గాజు, చెక్క , ఇసుక వంటి వాటిగా వేరు చేస్తారు. తరుణ్ అసోసియేట్ అనే ప్రైవేట్ సంస్థ ఈ ప్రక్రియ చేపట్టింది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఇసుక, మట్టిని నిడదవోలు మునిసిపాలిటీ పరిధిలోని పల్లపు ప్రాంతాలు మెరక చేసేందుకు వాడతారు. ఇక ఇనుము, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను యూనిట్ నిర్వాహకులే జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. దీనికోసం మునిసిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.76 కోట్లు కేటాయించింది. యార్డును ప్రక్షాళన చేయడం వల్ల డంపింగ్ యార్డు పరిసర నివాసితులకు దుర్వాసన బాధ తప్పుతుంది. యార్డు పక్కనే ఎప్పటి నుంచో ఉన్న లెప్రసీ కాలనీలో సుమారు 50 కుటుంబాలు నివశిస్తున్నాయి. యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో వారు ఇబ్బంది పడేవారు. మెజారిటీ వ్యర్థాల తరలింపుతో ఇప్పుడు వారికి చాలా వరకూ ఉపశమనం లభించింది. ఈ యార్డు సమీపంలో ఉన్న కోటసత్తెమ్మ వారి ఆలయానికి వచ్చే భక్తులకు కొద్ది రోజులుగా దుర్వాసన సమస్య తప్పింది.



రీ సైక్లింగ్‌లో వచ్చిన ప్లాస్టిక్ సీసాల ఎగుమతి



వ్యర్థాల సైక్లింగ్‌తో వచ్చిన మట్టిని పల్లపు ప్రాంతంలో పూడుస్తున్న దృశ్యం

37 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు

పట్టణ శివారు నెహ్రూ నగర్‌లో 4.56 ఎకరాల విస్తీర్ణంలోని డంపింగ్ యార్డులో 2023లో వ్యర్థాల రీ సైక్లింగ్ చేపట్టక ముందు 37,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు నిల్వ ఉండేవి. లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ఇప్పటి వరకూ 26 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేశారు. పట్టణంలోని 28 వార్డుల నుంచి రోజుకు 28 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఈ యార్డుకు తరలిస్తున్నారు. దీనికోసం మునిసిపాలిటీ 4 ట్రాక్టర్లు, రెండు కంపెస్టర్లు, రెండు జేసీబీలను వినియోగిస్తోంది. ఒక పర్మనెంట్ డ్రైవర్, నలుగురు కాంట్రాక్ట్ డ్రైవర్లు, 113 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. యార్డులోని మొత్తం వ్యర్థాలు తరలించాక ఆ స్థలాన్ని మునిసిపాలిటీకి అప్పగిస్తారు. అనంతరం పట్టణంలో సేకరించే తడి, పొడి వ్యర్థాలను ఇక్కడికే డంప్ చేస్తారు. తడి చెత్తను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికుల ద్వారా వర్మీ కంపోస్టుగా చేయించి, విక్రయించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా ఘన వ్యర్థాల సేకరణ

పట్టణంలోని 13 వార్డు సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా ఘన వ్యర్థాల సేకరణను ముమ్మరం చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో మేరీ లైఫ్ మేరా సహర్ నినాదంతో సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, పర్యావరణ కార్యదర్శులు రెడ్యూజ్, రీ యూజ్, రీ సైక్లింగ్ (ఆర్ఆర్ఆర్)విధానంలో ఇళ్లలోని వ్యర్థాలను సేకరిస్తున్నారు. పట్టణ పరిధిలోని గృహాల్లోని దుస్తులు, పాత సామాన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు, దుప్పట్లు, పాదరక్షలు, పరుపులు, ప్లాస్టిక్ వస్తువులను సేకరిస్తున్నారు. వాటిని ప్రతి వారం నాలుగు టన్నుల చొప్పున జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి వేంకటేశ్వర కల్యాణోత్సవాలు



ఆనంద తిరుమల వేంకటేశ్వర స్వామి

నల్లజర్ల: అనంతపల్లిలో కొలువైన ఆ నంద తిరుమల వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 28 నుంచి 30 వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మంగళవారం తోరణం కట్టడంతో ప్రారంభమై స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేస్తారన్నారు. సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. 29వ తేదీ బుధవారం విశేష అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు, దర్శనాలు, జరుగుతాయన్నారు. బుధవారం రాత్రి ఏడు గంటలకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. 30న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం పుష్పయాగం (పవళింపు సేవ) నిత్యహోమాలు నిర్వహిస్తారని చెప్పారు. వేద పండితుడు పెదపూడి విజయవెంకటరమణ ఆధ్వర్యంలో మదన గోపాలస్వామి ఆలయ అర్చకుడు డీవీ పాండు రంగశర్మ, ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం సంతోష్ పర్యవేక్షణలో ఈ క్రతువులు జరుగుతాయన్నారు.

వేగంగా వడ్లూరు రోడ్డు నిర్మాణం



నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

ఉండ్రాజవరం: మండలంలోని వడ్లూరు గ్రామ మెయిన్ రోడ్డు అభివృద్ధి, విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం వరకూ ఈ రోడ్డు అధ్వానంగా, ఇరుకుగా ఉండేది. ఆ గ్రామస్తులు ఈ ఆర్ అండ్ బీ రోడ్డు దుస్థితి గురించి నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడి దృష్టికి తీసుకు వెళ్లారు. రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు విస్తరించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ఆయనను గ్రామస్తులు కోరారు. దాంతో ఆయన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడి ఈ రోడ్డు అభివృద్ధికి రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఈ నిధులతో వడ్లూరు గ్రామంలో ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిని విస్తరించడమే గాకుండా సీసీ రోడ్డుగా నిర్మాణం పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా సాగుతున్నారు. ఈ పనులను సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యుడు వేండ్ర రమేష్ తదితరులు పరివేక్షిస్తున్నారు.

కృష్ణబాబు కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

కొవ్వూరు: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు కుటుంబ సభ్యులను ఆదివారం పలువురు ప్రముఖులు దొమ్మేరులోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఉండి ఎమ్మెల్యే ఎం.రామరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు, టీడీపీ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జ్ వలవల మల్లికార్జునరావు (బాజ్జీ), మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి తదితరులు కృష్ణబాబు చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సోదరులు పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు, కృష్ణ బాబు అల్లుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

మండల కేంద్రానికి విద్యా కానుకలు

పాఠ్య పుస్తకాలు, బెల్టులు సిద్ధం

దేవరపల్లి: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం తొలి విడతగా పాఠ్య పుస్తకాలు, బెల్టులు మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరుకున్నాయి. ప్రభుత్వం నాలుగు రోజులుగా మండల విద్యాశాఖ కార్యాలయాలకు పుస్తకాలు, బెల్టులు సరఫరా చేస్తోంది. తాడేపల్లిగూడెంలోని బుక్ డిపో నుంచి ఈ పుస్తకాల సరఫరా జరుగుతోంది. దేవరపల్లి మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలలకు 45,075 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, తొలి విడతగా శనివారం నాటికి 30,054 పుస్తకాలు సరఫరా అయినట్టు ఎంఈఓలు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. వాటిలో 8,9,10 తరగతుల విద్యార్థులకు 22,270, ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు 7814 పుస్తకాలు ఉన్నాయని తిరుమలదాస్ వివరించారు. విద్యాకానుకలో భాగంగా పుస్తకాలతో పాటు విద్యార్థుల కోసం 3,479 బెల్టులు వచ్చినట్టు తెలిపారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు, బెల్టులు మరో రెండు రోజుల్లో వస్తాయన్నారు. పాఠశాలలు తెరిచేనాటికి మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలు, బెల్టులు అందజేస్తామని చెప్పారు. అలాగే గోపాలపురం మండలంలోని 52 పాఠశాలలకు 74 వేల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, ఇప్పటి వరకూ 33 వేల పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. మిగిలిన పుస్తకాలు, బెల్టులు రెండు మూడు రోజుల్లో వస్తాయన్నారు. మొదటి విడతలో 40 శాతం పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసినట్టు చెప్పారు.



దేవరపల్లిలోని విద్యాశాఖ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు

నిడదవోలులో పోలీసుల కార్డన్ సెర్చ్

నిడదవోలు: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో జూన్ 6 వరకూ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని నిడదవోలు సీఐ జె.జానకిరామ్ అన్నారు. పట్టణ ఎస్సై పి.అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం స్థానిక ఇందిరానగర్, రాయిపేట ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దీనిలో భాగంగా వివాదాస్పద వ్యక్తుల, అనుమానితుల గృహాల్లో పోలీసులు సోదాలు జరిపారు. ఇంటింటికీ వెళ్లి ద్విచక్ర వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేని పది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తగిన పత్రాలు కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ జానకిరామ్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు అనంతరం రెండు రోజుల వరకూ విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్పులు నిషేధమన్నారు. కార్యక్రమంలో నిడదవోలు రూరల్, ఉండ్రాజవరం ఎస్సైలు రమేష్, అప్పలరాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మోటార్ సైకిళ్ల రికార్డులు తనిఖీ చేస్తున్న నిడదవోలు సీఐ జానకిరామ్, పోలీస్ సిబ్బంది

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నిడదవోలులో విద్యార్థులకు పోటీలు

నిడదవోలు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా ఆదివారం తొలుత విద్యార్థులతో వేమన, దాశరథి శతకాలు, దేశభక్తి గీతాలు, తెలుగు పద్యాలు చదివించారు. అనంతరం నేడు ఆధునిక సాంకేతిక రంగాల్లో సైన్స్ ఎలా అభివృద్ధి చెందింది అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కుంచే చినబాబు, ప్రసాద్, గంగాధర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌పీ కొయ్య నాగరాజు సూచించారు. గోపాలపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం వేమన పద్యాలు, జనరల్ నాలెడ్జ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్‌లకు అలవాటు పడకుండా గ్రంథాలయంలోని అనేక పుస్తకాలను చదువుకొని తమ పురోభివృద్ధికి బాటలు వేసుకోవాలని సూచించారు. జూన్ 7 వరకూ శాఖా గ్రంథాలయం సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాయల అధికారి వెజ్జు సత్యనారాయణ విద్యార్థులను సూచించారు.

20 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్ట్

దేవరపల్లి: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం దాడులు నిర్వహించి 20 మద్యం సీసాలు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. దేవరపల్లి మండలం కురుకూరులో 10 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని, గోపాలపురం మండలం చిట్యాలలో 10 మద్యం సీసాలతో మరో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సందడి



గోపాలపురం జెడ్పీ హైస్కూల్ 1978-79 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

గోపాలపురం: నాటి సహచర విద్యార్థులందరూ ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 1978–79 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. సుమారు 45 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకచోట చేరడంతో కోలాహలం నెలకొంది. వారంతా విద్యార్థుల మాదిరి బాల్యంలోకి వెళ్లిపోయారు. పూర్వ విద్యార్థుల్లో గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, గుడ్డిగూడెం పారిశ్రామికవేత్త సాగిరాజు అభిమన్యురాజు, ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత తాళ్ల వెంకట సత్యనారాయణ, జిల్లా ఉప విద్యాశాఖాధికారి కొల్లూరి సత్యనారాయణ, వేసంగి లక్ష్మణరెడ్డి, గోపాలపురం వ్యాపారవేత్త సత్తిరెడ్డి, ఆదర్శ రైతు కర్లపూడి సత్యనారాయణ, దుగ్గిరాల సుబ్బారావు కూడా ఉన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు.

ఉచితంగా విద్యార్థులకు యోగా శిక్షణ



ధ్యాన సాధన చేస్తున్న విద్యార్థులు

తాళ్లపూడి: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణ, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు స్థానిక గాయత్రీ యోగా సేవాసమితి గురువు నక్కా వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. యోగా దినోత్సవం రోజైన జూన్ 21 వరకు తాళ్లపూడిలోని గాయత్రీ యోగాసమితి కేంద్రం వద్ద విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా వివిధ రకాల ఆసనాల సాధన చేయడమే గాకుండా ధ్యానం చేస్తున్నారు. అంతే కాకుండా విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం చిత్రలేఖనం, చెస్, యోగా, రన్నింగ్, క్విజ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో విజేతలకు బహుమతులు అందజేస్తామని గురువు నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. అలాగే యువకులకు, మహిళలకు రోజు యోగా, జిమ్ శిక్షణ కూడా ఇస్తున్నారు.

28న శెట్టిపేటలో సురక్ష వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేట గ్రామ ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ ఆదివారం తెలిపారు. వేలివెన్ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో పాటు వైద్య నిపుణుల పర్యవేక్షణలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ముగిసిన వెలగలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో వెలగలమ్మ వారు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలో వెలగలమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. బంధు మిత్రుల రాకతో గ్రామం కిటకిటలాడింది. ఏ వీధిలో చూసినా ఆదివారం విందుభోజనాల సందడి కనిపించింది. శనివారం రాత్రి గ్రామ పొలిమేరలో బలిచేట ఊరేగించారు. ఆదివారం అమ్మవారికి నైవేధ్యాల సమర్పణతో జాతర తంతు ముగిసింది. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు. తాళ్లపూడి, చాగల్లు ఎంపీపీలు జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, నాయకులు జాతర వేడుకల్లో పాల్గొన్నారు.ఆదివారం గ్రామానికి తరలి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రూరల్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు.

విసనకర్ర.. కొనేవారే లేరాయె?

- అచ్చన్నపాలెంలో కొన్ని కుటుంబాలకు ఇదే ఉపాధి
- అమ్మకాలు లేక తయారీకి స్వస్తి

నల్లజర్ల: వేసవి వేడి, ఉక్కబోతల నుంచి ఉపశమనం కల్పించే విసనకర్రలకు రోజు రోజుకూ ఆదరణ తగ్గుతోంది. వేసవిలో ప్రతి ఇంట్లో దర్శనమిచ్చే విసనకర్ర నేడు కనుమరుగవుతోంది. ఎలక్ట్రానిక్ ఉపకరణాల ప్రవేశంతో ఈ కుటీర పరిశ్రమకు గడ్డుకాలం దాపురించింది. విసనకర్రల విక్రయాలతో బతుకుతున్న కార్మికులు జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు.

పేద వాడి ఫ్యాను విసన కర్ర. వాటి తయారీలో నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం వాసులకు పెద్ద పేరే ఉంది. ఒక సామాజిక వర్గానికి చెందిన పాతిక కుటుంబాలు ఇక్కడ ఉండేవి. ఉదయాన్నే పురుషులు తాటిచెట్ల నుంచి లేదా మట్టల నుంచి లేత ఆకులను నరికి తీసుకు వచ్చి ఎండబెడతారు. మధ్యాహ్నం నుంచి మహిళలు వాటిని కత్తిరించి విసన కర్రలుగా కడతారు. ఇది చాలా ఓర్పు, సహనంతో కూడుకున్న పని. ఇలా తయారు చేసిన విసనకర్రలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. అప్పట్లో వంద విసన కర్రలు అమ్మితే రూ.5 వచ్చేవని ప్రస్తుతం ఒక్కో విసనకర్ర రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నట్టు వృద్ధుడు గోగులమూడి వీరాచారి తెలిపాడు. గత నలభై ఏళ్లగా తమ కుటుంబం వేసవిలో ఇదే వృత్తిలో కొనసాగుతున్నట్టు వివరించారు. కాలక్రమంలో విసనకర్రల వాడకం తగ్గడంతో తయారీదార్లంతా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఈ విసన కర్రలు తయారు చేసే కుటుంబాలు రెండు మాత్రమే మిగిలాయి. వారు కూడ ఈ ఏడాది విసన కర్రలను తయారు చేయలేదు. తాటి చెట్లు అంతరించి పోవడంతో ఆకులు దొరకడం కష్టంగా ఉందని కాకర్లమూడి కేశవరావు అనే తయారీదారుడు వివరించారు. దాదాపు15 నుంచి 20 కిలోమీటర్ల దూరం వెళితే తప్ప తాటి చెట్లు కనపడడం లేదని తెలిపాడు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విసనకర్రలను గిరాకీ ఉంటుందని, మిగతా రోజుల్లో కూలి పనులకు వెళ్తామని ఈ పనిలో ఆరితేరిన మహిళ శారద వివరించారు. ఏటా రోజుకు 50కి పైగా విసన కర్రలు తయారు చేస్తున్నట్టు చెప్పారు. ఈఏడాది అది కూడ లేదు.



విసన కర్రల తయారీలో నిమగ్నమైన మహిళ శారద (ఫైల్)

కష్టానికి తగ్గ ప్రతిఫలం లేదు



ఇంటిల్లిపాదీ కష్టపడి తయారు చేసినప్పటికీ విసనకర్రలు కొనే వారే ఉండడం లేదు. శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. తర తరాలుగా ఇదే వృత్తిపై మా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రస్తుతం తాడిచెట్లు తగ్గిపోవడంతో ఆకుల సేకరణ కష్టమవుతోంది. కుటీర పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలి.

– గోగులమూడి వీరాచారి, తయారీదారు, అచ్చన్నపాలెం